క్లుప్తంగా

సంక్రాంతి కాంతులు నింపాలి



నగర మేయర్ బీవై రామయ్య

కర్నూలు (టౌన్): నగర ప్రజలకు మేయర్ బీవై రామయ్య, మున్సిపల్ కమిషనర్ ఎస్.రవీంద్రబాబు ఓ ప్రకటన ద్వారా సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. పాత నిర్బంధపు చీకట్లను రూపుమాపి కొత్త కాంతులు ఇంటింటా వెల్లివిరియాలని ఆశాభావం వ్యక్తం చేశారు. భాగ్యా లను అందించే బోగీ, కొత్త కాంతులు తెచ్చే సంక్రాంతి, కనుమ పండుగలను నగర ప్రజలు ఆనందంగా జరుపుకోవాలని ప్రకటనలో పేర్కొన్నారు.

యువతను సన్మార్గంలో నడిపించాలి



మాట్లాడుతున్న డాక్టర్ బ్రహ్మారెడ్డి

కర్నూలు(సెంట్రల్): యువత సన్మార్గంలో నడిచేలా శిక్షణ ఇవ్వాలని డాక్టర్ బ్రహ్మారెడ్డి సూచించారు. ఆదివారం బ్రహ్మారెడ్డి ఆసుపత్రిలో సీపీఐ నగర సహాయ కార్యదర్శి సి.మహేష్ అధ్యక్షతన ప్రజా సంఘాలకు శిక్షణ తరగతులను నిర్వహించారు. ప్రధాన బోధకుడిగా డాక్టర్ బ్రహ్మారెడ్డి వ్యవహరించారు. యువకులు చెడు మార్గంలో ప్రయాణిస్తుంటే ప్రభుత్వాలు ఏమి చేస్తున్నాయన్నారు. దేశానికి వెన్నుముకగా భావించే యువతను సన్మార్గంలో నడిపించేందుకు అవసరమైన శిక్షణ ఇవ్వాలన్నారు. కమ్యూనిస్టుల పోరాటాలతోనే దేశానికి మంచి భవిష్యత్ ఉందని, వారు పోరాటాలను కొనసాగించాల్సి ఉందన్నారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కె.జగన్నాథం, నగర కార్యదర్శి పి.రామకృష్ణ పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువుల వితరణ



నిత్యావసర వస్తువులను అందజేస్తున్న సంఘం నాయకులు

కర్నూలు కల్చరల్: కల్లూరు పెన్షనర్స్ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం మద్దూరు నగర్‌లోని అమ్మ వృద్ధుల ఆశ్రమంలో నిత్యావసర వస్తువులను వితరణ చేశారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని నిత్యావసర వస్తువులను అందజేశామని సంఘం నాయకులు పేర్కొన్నారు. సంఘం అధ్యక్షుడు డి.శ్రీరాములు, ఉపాధ్యక్షులు చలపతి, కోశాధికారి నాగరాజు, రామకృష్ణ, సభ్యులు పాల్గొన్నారు.


విలు విద్యతో ఏకాగ్రత



విలువిద్య శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ వాసురెడ్డి

కర్నూలు (టౌన్): విద్యార్థులు చదువుతో పాటు ఏకాగ్రత కోసం విలువిద్య వంటి క్రీడలను ఎంచుకోవాలని వీఆర్ హాస్పిటల్ క్యాన్సర్ శస్త్రచికిత్స వైద్యులు డాక్టర్ వాసురెడ్డి సూచించారు. ఆదివారం సాయంత్రం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో విలువిద్య శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒలింపిక్ సంఘం గుర్తించిన క్రీడలను విద్యార్థినీ, విద్యార్థులు ఎంచుకొని సాధన చేయాలన్నారు. ఏకాగ్రతతో రాణిస్తే జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకోవచ్చన్నారు. ఈ క్రీడ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తామన్నారు. విలువిద్య సంఘం కార్యదర్శి నాగ రత్నమయ్య, చరణ్, బాలాజీ, ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సాక్షి సినిమాలు



ఎస్వీసీ కాంప్లెక్స్ : డాకు మహరాజ్, గేమ్ ఛేంజర్
వి మెగా ఆనంద్ సినీ కాంప్లెక్ :డాకుమహరాజ్, గేమ్ ఛేంజర్
వెంకటేష్ సినీ కాంప్లెక్స్ : డాకు మహరాజ్, గేమ్ ఛేంజర్
శ్రీరామ : గేమ్ ఛేంజర్
రాజ్ : డాకు మహరాజ్
భరత్ కాంప్లెక్స్: డాకు మహరాజ్
విజయ థియేటర్ : డాకు మహరాజ్
విక్టరీ టాకీస్ : మార్కో

వివేకానందుడి బాటలో నడుద్దాం



నివాళులర్పిస్తున్న ఒకేషనల్ కాలేజీ ప్రిన్సిపాల్ నాగస్వామినాయక్, తదితరులు



నివాళులర్పిస్తున్న ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు



వివేకానందుడి విగ్రహానికి నివాళులర్పించిన కమిషనర్ తదితరులు



వివేకానంద కేంద్ర ఆధ్వర్యంలో..

కర్నూలు (టౌన్): స్వామి వివేకానందుడి మాటలు తారకమంత్రంగా భావించి స్వశక్తితో ఎదిగే ప్రయత్నం చేస్తే యువత దేశానికి విలువైన సంపదగా నిలుస్తారని నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు అన్నారు. వివేకానంద 162వ జయంతి పురస్కరించుకొని ఆదివారం జాతీయ యువజన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక రాజ్‌విహార్ సెంటర్‌లోని స్వామి వివేకానందుడి విగ్రహానికి కమిషనర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కమిషనర్ మాట్లాడుతూ.. వివేకానందుడికి యువతతో లోతైన అనుబంధం ఉండటంతో కేంద్ర ప్రభుత్వం ఆయన జయంతిని జాతీయ యువజన దినోత్సవంగా ప్రకటించిందన్నారు. వివేకానందుడిని స్ఫూర్తిగా తీసుకొని దేశాభివృద్ధికి పాటుపడాలన్నారు.

అధికారుల నిర్లక్ష్యం

స్వామి వివేకానందుడి జయంతిని మున్సిపల్ అధికారులు విస్మరించారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. స్థానిక రాజ్‌విహార్‌లోని వివేకానందుడి విగ్రహానికి అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, మేధావులు, వివేకానంద కేంద్ర కార్యవర్గ సభ్యులు ఇలా... అనేక మంది పూలమాలలు వేసి ఆయన జయంతిని ఘనంగా జరుపుకుంటారు. అయితే విగ్రహం వద్ద ఎలాంటి అలంకరణ చేయకపోవడం, పూలదండలు వేసేందుకు ఏర్పాటు చేసిన ఇనుప నిచ్చెన కింది భాగంలో విరిగిపోయి ఉండటంతో పలువురు విస్మయం వ్యక్తం చేశారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని వివేకానంద కేంద్ర కార్యవర్గ సభ్యులు మున్సిపల్ అధికారులను డిమాండ్ చేశారు.

కర్నూలు(సెంట్రల్): స్వామి వివేకానంద స్ఫూర్తితో మతోన్మాదం, డ్రగ్స్ నివారణ, నిరుద్యోగం అంతమయ్యే వరకు పోరాటాలు కొనసాగిస్తామని డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శులు వై.నగేష్, అబ్దుల్లా పేర్కొన్నారు. రాజ్‌విహార్ సెంటర్‌లోని ఆయన విగ్రహానికి డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. డీవైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర, రంగప్ప పాల్గొన్నారు.

కర్నూలు సిటీ: బి క్యాంపులోని ప్రభుత్వ వొకేషనల్ జూనియర్ కాలేజీలో నిర్వహించిన స్వామి వివేకానంద జయంతి వేడుకల్లో ప్రిన్సిపాల్ ఎస్.నాగస్వామి నాయక్ పాల్గొని వివేకనంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అధ్యాపకులు మల్లికార్జున, కాలేజీ సిబ్బంది పాల్గొన్నారు.

➤ హారిజోన్స్ ఇంటర్నేషనల్ హైస్కూల్‌లో చైర్మన్ ప్రదీప్‌కుమార్, డైరెక్టర్ పావని వివేకానందుడి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కర్నూలు కల్చరల్: వివేకానంద రాక్ మెమోరియల్, వివేకానంద కేంద్రం కర్నూలు శాఖ ఆధ్వర్యంలో రాజ్‌విహార్‌లోని స్వామి వివేకానంద విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కేంద్ర ప్రతినిధి శివప్రసాద్, రవీంద్ర విద్యా సంస్థల అధినేత జి.పుల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

➤ కురువ సంఘం ఆధ్వర్యంలో.. సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుడిసె శివన్న, జిల్లా ఉపాధ్యక్షుడు ధనుంజయ, ప్రధాన కార్యదర్శి రంగస్వామి, కోశాధికారి కేసీ నాగన్న, తదితరులు వివేకానందుని విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

➤ రాయలసీమ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్, డాక్టర్ నాగరాజు, సిబ్బంది నివాళులర్పించారు.

➤ జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థలో జరిగిన కార్యక్రమంలో గ్రంథాలయ సహాయ అధికారి వజ్రాల గోవిందరెడ్డి, ఉద్యోగులు, పాఠకులు పాల్గొన్నారు. యునైటెడ్ కన్స్యూమర్ ప్రొటెక్షన్ అండ్ లీగల్ రైట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంస్థ ఏపీ స్టేట్ చైర్మన్ లయన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, సభ్యులు వివేకానందుని విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు.

ప్రజలకు సేవ చేయాలి

కర్నూలు కల్చరల్: కుల మతాలకు అతీతంగా ప్రజలకు సేవ చేయాలని నిఖిలేష్ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ మద్దిలేటి అన్నారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని నిరుపేదలకు ఆదివారం నిత్యావసర వస్తువుల కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదలకు దానధర్మాలు చేయడమే మానవత్వానికి మరో పేరన్నారు. న్యాయవాది చిన్నయ్య, పాస్టర్ రవి, సుమలత, తదితరులు పాల్గొన్నారు.

ప్రియాంక గాంధీ జన్మదిన వేడుకలు

కర్నూలు(సెంట్రల్): ఇందిరాగాంధీ ప్రతిరూపమే ప్రియాంక గాంధీ అని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పి.మురళీకృష్ణ పేర్కొన్నారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ప్రియాంక జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేకును కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. ప్రియాంక గాంధీతో కాంగ్రెస్‌కు మంచి నాయకత్వం వస్తుందన్నారు. మాజీ ఎమ్మెల్సీ సుధాకరబాబు, నాయకులు సాంబశివుడు, శివానంద, షేక్ ఖాజా హుస్సేన్, ప్రమీళ, సయ్యద్ నవీద్, లాజరస్ పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని విద్యాసంస్థలను సీజ్ చేయాలి

కర్నూలు(సెంట్రల్): జిల్లాలోని కొన్ని ప్రైవేట్, కార్పొరేట్ కాలేజీలు, పాఠశాలలు సంక్రాంతి సెలవుల్లోనూ తరగతులు నిర్వహించి విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురి చేస్తున్నాయని ఎస్ఎఫ్ఐ నాయకులు అబూబకర్, మల్లేష్, ఆర్యన్ ఆవేదన వ్యక్తం చేశారు. సెలవుల్లో తరగతులను నిర్వహించే పాఠశాలలు, కళాశాలలను అధికారులు సీజ్ చేయాలన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా తరగతులు నిర్వహిస్తున్నా అధికారులు చూసీ చూడనట్లు ఉండడం తగదన్నారు.

ముగ్గు నెగ్గితే ఇంటి ప్లాటు



స్టేడియంలో ముగ్గుల పోటీ ఏర్పాట్లను పరిశీలిస్తున్న వెంకటేశ్వర్ రెడ్డి

కర్నూలు కల్చరల్: సంక్రాంతి పండుగ సందర్భంగా డీవీఆర్ బ్రాడ్ బ్యాండ్ ఆధ్వర్యంలో అవుట్ డోర్ స్టేడియంలో సోమవారం మెగా ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు డి.వెంకటేశ్వర్ రెడ్డి తెలిపారు. ముగ్గుల పోటీల్లో విజేతలకు ఆకర్షణీయమైన బహుమతులు అందించనున్నట్లు పేర్కొన్నారు.మొదటి బహుమతి రెండున్నర సెంట్ల ప్లాటు, ద్వితీయ బహుమతి ఎలక్ట్రికల్ స్కూటీ, తృతీయ బహుమతి సోఫాసెట్ అందించనున్నట్లు చెప్పారు. వీటితో పాటు పది ప్రోత్సాహక బహుమతులు, పోటీల్లో పాల్గొనే ప్రతి ఒక్కరికి రైస్ కుక్కర్ అందజేయనున్నట్లు తెలిపారు. పోటీల్లో 1000 మంది ముగ్గులు వేయనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు.

డ్రైనేజీలను ఆక్రమిస్తే చర్యలు



కొత్తపేట వద్ద పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు (టౌన్): మురుగు కాల్వలపై నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు హెచ్చరించారు. ఆయన ఆదివారం తెల్లవారుజామున కొత్తపేట, రాజ్‌విహార్ కూడలి ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నగర ప్రజలు ఇళ్లలోని చెత్తను తప్పనిసరిగా నగరపాలకకు చెందిన వాహనాలకే అప్పగించాలన్నారు. కాలనీల ప్రజలు చెత్తను మురుగు కాల్వల్లో వేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. దీని వల్ల మురుగు నీటి సమస్య వస్తోందన్నారు. ఎక్కడపడితే అక్కడ మురుగు కాల్వలను ఆక్రమించి ర్యాంపులు నిర్మించడం, ఆక్రమణలు చేస్తున్నారన్నారు. వీటి వల్ల పూడికతీత పనులకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందన్నారు. డ్రైనేజీలను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



కురువ సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గోరంట్ల మాధవ్

కర్నూలు(టౌన్): వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గోరంట్ల మాధవ్ ఆదివారం కర్నూలులోని తన స్వగృహంలో కురువ సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కురువ సంఘం నాయకులు, పెద్దలు భారీ సంఖ్యలో హాజరై గోరంట్ల మాధవ్ చేతుల మీదుగా క్యాలెండర్‌ను విడుదల చేశారు. ఆయన వారికి సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



గురువులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

కర్నూలు సిటీ: శ్రీరామ్‌నగర్‌లోని ఎం.హెచ్ అప్పా ఎయిడెడ్ హైస్కూల్ పూర్వ విద్యార్థులు ఆదివారం ఆ స్కూల్ సమ్మేళనాన్ని నిర్వహించారు. 1990 టెన్త్ క్లాసు బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు మూడు దశాబ్దాల తరువాత తిరిగి కలుసుకోవడంతో ఆ స్కూల్ వాతావరణం అంతా సందడిగా మారింది. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకొని ఒకరి బాగోగులు ఒకరు అడిగి తెలుసుకున్నారు. స్కూల్ ఆవరణంలో తిరుగుతూ నాటి జ్ఞాపకాలను జ్ఞప్తికి తెచ్చుకొని సంబరపడ్డారు. నాడు వారికి చదువులు చెప్పిన టీచర్లను సన్మానించారు. స్కూల్ పూర్వ విద్యార్థులు హాజీ, కె.సురేష్, రమేష్, నాగ మద్దిలేటి, శోభ, సరళ, అరుణ, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో తిరుమంజన సేవ



ప్రత్యేక అలంకరణలో రంగనాథ స్వామి

కర్నూలు కల్చరల్: ధనుర్మాసం పురస్కరించుకొని ఆదివారం భరతమాత ఆలయంలో గోదా రంగనాథ స్వామివారికి భక్తిశ్రద్ధలతో తిరుమంజన సేవ నిర్వహించారు. తిరుప్పావై పాశురాలు పారాయణం చేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు సందడి మహేశ్వర్, విష్ణు సహస్రనామ సత్సంగం అధ్యక్షుడు పుల్లారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు శ్రీనివాసులు, నారాయణరెడ్డి, చంద్రారెడ్డి, శ్రీనివాసరెడ్డి, మాతృశక్తి సభ్యులు లావణ్య, శ్రీదేవి, శకుంతల, గాయత్రి, పద్మ, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.




పూజల్లో పాల్గొన్న భక్తులు

ఆకాశమే హద్దుగా..



మిద్దెపై గాలిపటాలను ఎగుర వేస్తున్న చిన్నారులు





నిత్యం పుస్తకాలతో కుస్తీ పట్టే విద్యార్థులకు సంక్రాంతి పండుగ సెలవులు రావడంతో సరదాగా గడుపుతున్నారు. పట్టణంలోని పలు వీధుల్లో చిన్నారులు గాలిపటాలను కొనుగోలు చేసి ఉత్సాహంగా వాటిని ఎగురవేస్తున్నారు. మిద్దెలు, గోడలు ఎక్కి ×నాదంటే నా గాలిపటం ఎక్కువ ఎత్తులో ఎగురుతుంది చూడు₹ అంటూ సంతోషంగా చెప్పుకుంటూ సందడి చేస్తున్నారు. వారిని చూసి తల్లిదండ్రులు, బంధువులు ×రేయ్ మిద్దెల మీద జాగ్రత్త, గోడలు ఎక్కొద్దు అంటూ సూచనలు చేస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు

నేటి నుంచి మరియగిరి పుణ్యక్షేత్ర మహోత్సవాలు

ఓర్వకల్లు: మండలంలోని ఉప్పలపాడు గ్రామంలో వెలసిన మరియగిరి పుణ్యక్షేత్ర మహోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభమవుతున్నట్లు విచారణ గురువులు రెవ.ఫా. ప్రశాంతకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మరియగిరి పుణ్యక్షేత్రం 29వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న మహోత్సవాలలో భాగంగా 13న సాయంత్రం జపమాల, పాప సంకీర్తనములు, దివ్యబలిపూజ అనంతరం లూర్దుమాత కథిడ్రల్ విచారణ గురువులు సిద్ధిపోగుల దేవదాస్‌చే వాక్యోపదేశం ఉంటుందన్నారు. 14న రెవ.ఫా.తరుణ్ ఆధ్వర్యంలో జపమాల, దివ్యబలిపూజ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. 15న సాయంత్రం గ్రామం నుంచి గ్రామ శివారులో గల కొండపైకి జపమాలతో మరిమాత స్వరూపాన్ని మేళతాళాల మధ్య ఊరేగింపు కార్యక్రమం, సాయంత్రం 6 గంటలకు ఆదోనికి చెందిన ప్రీస్ట్ ఆఫ్ ఇన్ఫ్యాంట్ జీసస్ చర్చి డీన్ రెవ.ఫా.కోల విజయరాజు ఆధ్వర్యంలో మహా దివ్యబలి పూజ ఉంటుందన్నారు. అనంతరం వెంకాయపల్లెకు చెందిన సెయింట్ ఫ్రాన్సిస్ జేవియర్ పారీస్ డైరెక్టర్ రెవ. ఫా. కొదురా రాజేంద్రకుమార్‌చే బైబిల్ ప్రసంగం ఉంటుందన్నారు. ఈ మహోత్సవాలకు హాజరయ్యేందుకు భక్తుల సౌకర్యార్థం మధ్యాహ్నం 3 గంటలకు బిషప్ బంగ్లా, కర్నూలు (నంద్యాల చెక్ పోస్టు) నుంచి, ప్రేమగిరి వయా నూతనపల్లె మీదుగా ఉచిత బస్సును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాత్రి భక్తులకు అన్నదానం ఉంటుందన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు



వైద్య సేవలను పరిశీలిస్తున్న సమన్వయకర్త శ్రీదేవి

కల్లూరు: ఇంటర్నేషనల్ యూత్ డే సందర్భంగా ఆదివారం చిన్నటేకూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఐఐటీ, మెడికల్ అకాడమీలో శ్రీ రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందించారు. ఈ కార్యక్రమాన్ని సాంఘిక సంక్షేమ గురుకులాల కర్నూలు జిల్లా సమన్వయకర్త ఐ.శ్రీదేవి మెడికల్ క్యాంపును పర్యవేక్షించారు. అకాడమీ డైరెక్టర్ ఉమామహేశ్వరప్ప, డాక్టర్లు శరత్ చంద్ర బృందం పాల్గొన్నారు.

ముగిసిన నృత్యోత్సవాలు



నృత్య పోటీల విజేతలతో అతిథులు

కర్నూలు కల్చరల్: కళా సౌరభ పదో వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని నటరాజ నృత్య కళా మందిర్, టీజీవీ కళాక్షేత్రం సంయుక్త నిర్వహణలో సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న శాస్త్రీయ, జానపద నృత్య పోటీలు ఆదివారం ముగిశాయి. రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. జాతీయ స్థాయి శాస్త్రీయ, జానపద నృత్యాల పోటీలకు వివిధ ప్రాంతాల నుంచి హాజరైన కళాకారులను ప్రశంసించారు. కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, శ్రీ నటరాజ నృత్య కళామందిర్ నిర్వాహకులు కరీముల్లా మాట్లాడుతూ.. వివిధ ప్రాంతాల నుంచి 200 మంది కళాకారులు హాజరై నృత్య ప్రదర్శనలు ఇచ్చారన్నారు. అనంతరం విజేతలకు అతిథులు బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. చిన్న జీయర్ స్వామి ఆస్థాన నాట్యాచార్యులు ఘంటసాల పవన్, నాట్యాచార్యులు పట్నం శివప్రసాద్, చంద్రశేఖర్‌లను సన్మానించారు. నటరాజ నృత్య కళా మందిర్ అధ్యక్షుడు స్వరూపసింహ, సభ్యులు, టీజీవీ కళాక్షేత్రం సభ్యులు పాల్గొన్నారు.

భారీగా నాటుసారా పట్టివేత



స్వాధీనం చేసుకున్న నాటుసారా, ఆటోను చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

కర్నూలు: కర్నూలు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని కొల్లంపల్లి తండా రహదారిలో ఆటోలో భారీగా నాటుసారా పట్టుబడింది. కర్నూలు ఎక్సైజ్ సీఐ చంద్రహాస్, ఈఎస్‌టీఎఫ్ సీఐ రాజేంద్రప్రసాద్ నేతృత్వంలో ఆదివారం కొల్లంపల్లి తండా రహదారిలో వాహన తనిఖీలు నిర్వహించారు. ప్రయాణికులతో వెళ్తున్న ఒక ఆటోని ఆపి తనిఖీ చేయగా, సీట్ల కింద అరల్లో దాదాపు 200 లీటర్ల సారా ప్యాకెట్లు బయటపడ్డాయి. కొల్లంపల్లితాండాకు చెందిన రామదాసు సారాను బనగానపల్లెకు తరలిస్తున్నట్లు బయట పడింది. రవాణాదారుడు ఉల్లిందకొండకు చెందిన రామక్రిష్ణగా తేలడంతో ఆటోతో పాటు సారాను స్వాధీనం చేసుకొని స్టేషన్‌కు తరలించారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి రామక్రిష్ణను జైలుకు పంపారు. ప్రధాన నిందితుడు రామదాసు కోసం గాలిస్తున్నట్లు సీఐ తెలిపారు. తనిఖీల్లో ఎస్ఐ రెహనా, తేజ, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

లోపించిన పారిశుద్ధ్యం



పెద్దాసుపత్రిలోని వన్‌స్టాప్ సెంటర్ వద్ద మురుగు

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఆవరణలోని వన్‌స్టాప్ సెంటర్ వద్ద అపరిశుభ్రత నెలకొంది. వన్‌స్టాప్ సెంటర్‌కు పక్కనున్న పీజీ హాస్టల్ కిచెన్‌కు సంబంధించిన వ్యర్థాలు పక్కనున్న మురుగు కాలువలోకి వెళ్తాయి. కాలువ పూడిపోవడంతో మురుగు నీరంతా పక్కనున్న వన్‌స్టాప్ సెంటర్ మీదుగా సమీపంలో ఉన్న హౌస్‌సర్జన్స్ హాస్టల్ వద్దకు చేరుతోంది. దీంతో ఆ ప్రాంతమంతా మురుగుమయంగా మారి పందులకు ఆవాసంగా మారింది. సమస్యపై ఆసుపత్రి అధికారులకు పలుమార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

– కర్నూలు(హాస్పిటల్)